క్లుప్తంగా

ఉద్యాన రైతులకు ప్రోత్సాహం



చిన్నటేకూరులో రోజ్ గార్డెన్‌ను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

కల్లూరు : ఉద్యాన రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం కల్పిస్తోందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామంలో ఫ్లోరికల్చర్‌లో భాగంగా వేసిన ఉద్యాన పంట రోజ్ గార్డెన్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా జాబ్ కార్డు ఉండి అర్హత కలిగిన రైతులందరికీ పండ్ల తోటలు, పూల మొక్కల సాగుకు ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

బిలకలగూడూరులో చోరీ



బీరువా పగలగొట్టి చోరీ చేసిన దృశ్యం

గడివేముల: మండల పరిధిలోని బిలకలగూడూరులో శనివారం చోరీ జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన చిట్టిపు శంకర రెడ్డి ఇంట్లో అందరూ పనికి వెళ్లిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి దొంగతనం చేశారు. రూ.1,16,000 ల నగదు అపహరణకు గురైనట్లు బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. చోరీపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోండి



గడిగరేవులలో రైతు నాగేశ్వరరావుతో మాట్లాడుతున్న అంబుడ్స్‌మెన్ సురేంద్రకుమార్

గడివేముల: పండ్లతోటల పెంపకానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఇస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అంబుడ్స్‌మెన్ సురేంద్రకుమార్ సూచించారు. శనివారం ఆయన మండల పరిధిలోని గడిగరేవుల, దుర్వేశిలోని మామిడి, మునగ తోటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మొక్కల కొనుగోలు, నెలవారీ నిర్వహణకు ప్రభుత్వం చేయూతనిస్తోందని తెలిపారు. తోటల యాజమాన్యంలో ఎదురవుతున్న పలు సమస్యలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. సందర్శనలో ఏపీవో వెంకటరమణ, క్షేత్ర, సాంకేతిక సహాయకులు, ఈసీలు పాల్గొన్నారు.

గూడూరులో పోలీసు బలగాల కవాతు



గూడూరులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

గూడూరు : పట్టణంలో శనివారం పోలీసు బలగాలు (రాపిడ్ యాక్షన్ ఫోర్స్) కవాతు నిర్వహించాయి. ఎస్‌ఐ పవన్‌కుమార్ మాట్లాడుతూ రాబోవు వినాయక చవితి, ఎన్నికల దృష్ట్యా పట్టణంలో అవాంఛనీయ ఘటనలు, అలజడులు జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజల్లో మనో ధైర్యం నింపేందుకే ఈ కవాతు నిర్వహించానట్లు ఆయన తెలిపారు.

దూర విద్య కేంద్రం ఏర్పాటు

కల్లూరు : దూపాడు సమీపంలోని డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి స్కూల్ ఆఫ్ బిజినెస్ మెనేజిమెంట్ (ఎంబీఏ) కళాశాలలో సింబయాసిస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ, పుణె వారికి అనుబంధంగా దూర విద్యా కేంద్రం ఏర్పాటు చేశామని కళాశాలల చైర్మన్ విశ్వమోహన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరం 2023-2024 నుంచి కేంద్రం ప్రారంభమవతుందన్నారు. మరిన్ని వివరాలకు 7680076627, 7680076603 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రేకుల షెడ్డు పైనుంచి పడి కూలీ మృతి

కర్నూలు : కర్నూలు మండలం గొందిపర్ల మజరా పూలతోట గ్రామానికి చెందిన బోయ చిన్న మద్దిలేటి రేకుల షెడ్డు పైనుంచి కింద పడి మృతిచెందాడు. గుత్తి పెట్రోల్ బంకు సమీపంలోని వెంకటేశ్వర కళ్యాణ మండపం దగ్గర శనివారం మధ్యాహ్నం రేకుల షెడ్డు నిర్మాణ పనులకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కింద పడి తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. ఈయనకు ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు సంతానం. భార్య బోయ లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మెనూ అదిరేలా...
పిల్లలకు నచ్చేలా !

- ప్రభుత్వ పాఠశాలల్లో రుచికరంగా మధ్యాహ్న భోజనం
- 'జగనన్న గోరుముద్ద'కు అదనంగా రాగిజావ
- పెరుగుతున్న భోజనం చేసే విద్యార్థుల సంఖ్య

మెనూ వివరాలు..

సోమవారం:	హాట్ పొంగల్, ఉడికించిన గుడ్డు, కూరగాయల పలావ్, గుడ్డు కూర, చిక్కీ.
మంగళవారం:	పులిహోర, టమాట పచ్చడి, దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్లు, రాగి జావ.
బుధవారం:	వెజిటబుల్ బిర్యానీ, ఆలు కుర్మా, ఉడికించిన గుడ్డు, చిక్కీ.
గురువారం:	సాంబార్ బాత్, ఉడికించిన గుడ్డు.
శుక్రవారం:	ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ.
శనివారం:	ఆకు కూర, సాంబారు, తీపి పొంగలి, రాగి జావ.



బూజునూరు ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

గడివేముల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. పోషకాలున్న ఆహారాన్ని తీసుకున్నప్పుడే విద్యార్థులు ఆరోగ్యంగా ఉండి చదువులోనూ రాణిస్తారనే ఉద్దేశంతో రోజుకో మెనూతో జగనన్న గోరుముద్దను అమలు చేస్తోంది. విద్యార్థులకు రుచికరమైన ఆహారంతో పాటు రాగి జావను సైతం అందిస్తోంది. దీంతో విద్యార్థులు ఇష్టంగా మధ్యాహ్న భోజనాన్ని ఆరగిస్తున్నారు.

విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా..

గడివేముల మండలంలో 37 ప్రభుత్వ పాఠశాలు ఉన్నాయి. ఇందులో 28 ప్రాథమిక పాఠశాలలు, నాలుగు ప్రాథమికోన్నత పాఠశాల, 5 ఉన్నత పాఠశాలు ఉన్నాయి. వీటిలో 3,499 మంది విద్యాలుండగా ప్రతిరోజు 3,115 మంది మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా ప్రభుత్వం మెనూలో మార్పులు తెస్తోంది. ఎప్పటికప్పుడు పిల్లలు, విద్యాశాఖ అభిప్రాయాలను సేకరిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో సరిగా సాంబారు తినక పోవడంతో నిమ్మకాయ పులిహోర (చిత్రాన్నం) మెనూలో చేర్చారు. నాణ్యమైన అహారాన్ని అందించేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి నిత్యం ఆయా పాఠశాలలో ముందుగా ఉపాధ్యాయుడు వెళ్లి పరిశీలించిన అనంతరమే విద్యార్థులకు భోజనాన్ని అందిస్తున్నారు.

నెలకు నాలుగుసార్లు గుడ్ల సరఫరా

గతంలో ఏజెన్సీల నిర్వాహకులు నెలకు మూడు సార్లు కోడిగుడ్లు సరఫరా చేసేవారు. దీంతో కొన్ని చోట్ల గుడ్లు చెడిపోయేవి. ఫలితంగా విద్యార్థులు తినేందుకు ఇబ్బంది పడేవారు. గమనించిన ప్రభుత్వం నెలకు నాలుగు సార్లు గుడ్లు సరఫరా చేయాలంటూ ఆదేశాలు జారీ చేసింది. ఏ వారంలో సరఫరా అయిన గుడ్లను అదే వారంలోనే వినియోగించేలా గుర్తులు వేస్తున్నారు. విద్యార్థులకు వారానికి ఐదు గుడ్లు ప్రభుత్వం అందిస్తోంది. ప్రభుత్వం ఇన్ని జాగ్రత్తలు తీసుకుంటున్న నేపథ్యం లోనే పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేసే విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని పలు పాఠశాలల ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్లు చెబుతున్నారు.

భోజనం రుచిగా ఉంటుంది



నేను ప్రతిరోజు పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం చేస్తాను. వారంలో ఐదు రోజులు కోడి గుడ్డు ఇస్తారు. రోజుకో రకం వెరైటీ భోజనం పెడుతున్నారు. భోజనం రుచిగా ఉంటుంది.

– టీ వైష్ణవి, 4వ తరగతి, ఎంపీపీ పాఠశాల, బూజునూరు.

రోజూ పాఠశాలలోనే తింటా



గతంలో మధ్యాహ్న భోజనం సరిగా తినే వాళ్లం కాదు. ఇప్పుడు చాలా రుచిగా ఉంటుండడంతో రోజూ పాఠశాలలోనే తింటున్నాను. ఇంట్లో భోజనంలాగే ఉంటుంది. భోజనం తయారైన అనంతరం రోజుకో ఉపాధ్యాయుడు వెళ్లి భోజనం పరిశీలించి మాకు అందజేస్తారు. రాగిజావ ఎంతో ఉపయోగపడుతుంది.

– జోత్స్న, 9వ తరగతి, జెడ్పీ ఉన్నత పాఠశాల, గడివేముల

భోజనం చేసే విద్యార్థులు పెరిగారు



రాష్ట్ర ప్రభుత్వం జగనన్న గోరుముద్దగా పౌష్టికాహారం అందిస్తుంది. గతంలో కంటే పాఠశాలలో మధ్యాహ్న భోజనం తినే విద్యార్థుల సంఖ్య పెరిగింది. విద్యార్థులకు ఇష్టమైన ఆహారం పెట్టడం, ప్రత్యేకంగా మెనూలో రాగి జావ చేర్చడంతో పోషకాలు బాగా అందుతున్నాయి. ప్రతి రోజుల ఎదో ఒక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తాం. మెనూ ప్రకారం అందించకపోతే చర్యలు తీసుకుంటాం.

– విమల వసుంధరదేవి, ఎంఈఓ-2, గడివేముల

సర్వేను పూర్తి చేయాలి

కల్లూరు: బడి బయటి పిల్లలను గుర్తించేందుకు నిర్వహించే జీఆర్ రీసర్వేను సకాలంలో పూర్తి చేయాలని ఎంఈఓలు శ్రీనివాసులు, వనజ కుమారి సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు.

మహిళ అదృశ్యం

కల్లూరు : ఉలిందకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దూపాడు గ్రామానికి చెందిన మహిళ అదృశ్యమైనట్లు ఎస్‌ఐ నల్లప్ప శనివారం తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలు దూపాడు గ్రామానికి చెందిన బి. భారతి (23) కర్నూలు నగరంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో రిసెప్షనిస్టుగా పనిచేస్తుంది. జూన్ 30వ తేదీన డ్యూటీకి వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల దగ్గర వెతికినా ఆచూకీ లభించలేదు. మేనమామ పురుషోత్తం శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

అంటువ్యాధులను అరికట్టాలి

కర్నూలు (న్యూటౌన్): వర్షాకాలంలో గ్రామీణ ప్రాంతాల్లో అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి రామగిడ్డయ్య వైద్య సిబ్బందిని ఆదేశించారు. శనివారం కర్నూలు మండలం ఉల్చాల, నిడ్జూరు గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంటి వెలుగు కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా లేదా, వాతావరణ మార్పులతో వచ్చే అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ముందస్తుగా గ్రామీణ ప్రజలకు సూచనలు, సలహాలిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం ఆయా గ్రామాల్లో మురుగు కాల్వలు, నీటి తొట్లను తనిఖీ చేసి పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ పథకాలు



మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

- ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన
- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్
- వెంకటగిరిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కోడుమూరు రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గ్రామ సచివాలయాలు, వలంటరీ వ్యవస్థ ద్వారా గడప గడపకు చేరుతున్నాయని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. శనివారం మండలంలోని వెంకటగిరి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల నుంచి పొందిన లబ్ధిని వివరించడంతో పాటు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హంద్రీనది నుంచి గ్రామానికి సప్లై చేసే నీళ్ల మోటారుకు 9గంటల కరెంట్ మాత్రమే ఇస్తుండడంతో గ్రామంలో 2, 3 రోజులకోసారి మంచి నీళ్లు సరఫరా అవుతుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, 24 గంటల కరెంట్ కనెక్షన్ ఇప్పించి నీటి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యేను గ్రామస్తులు కోరారు. వెంటనే నీటి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్‌ను ఆదేశించారు.

నేరుగా సంక్షేమ పథకాలు

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగిస్తున్నారన్నారు. గత 70ఏళ్లలో ఏ ప్రభుత్వం కూడా అందించని విధంగా మధ్య దళారీ వ్యవస్థ లేకుండా అర్హతే ప్రామాణికంగా నేరుగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనివాసులు, ఏపీఎం పుష్పావతి, ఏపీఓ రమాదేవి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ భీమిరెడ్డి, సర్పంచులు బాలకృష్ణ, మధుసూదన్‌రెడ్డి, స్థానిక నేతలు అద్దుగల రాజశేఖరరెడ్డి, చిన్నారెడ్డి, లాయర్ ప్రభాకర్, రామగిడ్డయ్య, బలరాం తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులకు ప్రాణం పోసిన మహనీయుడు వైఎస్సార్

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- పాణ్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

పాణ్యం : ఉమ్మడి రాష్ట్రంలో ప్రాజెక్టులను కృష్ణా, గోదావరి జలాలలో నింపిన ఘనుడు, ప్రాజెక్టులకు ప్రాణం పోసిన మహనీయుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పాణ్యంలోని సచివాలయం-4 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి సంక్షేమ క్యాలెండర్ అందించి సంక్షేమ ఫలాలను వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో వందల ప్రాజెక్టులకు వైఎస్సార్ ప్రాణం పోశారన్నారు. నేడు సీమలోని మెట్ట పొలాల్లో కృష్ణా జలాలు పరవళ్లు తొక్కుతున్నాయంటే ఆయన చలువేనని చెప్పారు. 2019లో అధికారంలోకి వచ్చిన ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయన బాటలోనే ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అనతి కాలంలోనే ప్రాజెక్టులకు రూపం తెచ్చారన్నారు. ప్రభుత్వ ఫలాలు అందించడంతో సీఎం వైఎస్ జగన్ పారదర్శకత పాటిస్తున్నారని తెలిపారు.

గోరుకల్లు సృష్టికర్త మహానేత

కృష్ణా వరద జలాలను సీమలోని జిల్లాలకు మళ్లించే క్రమంలో నిర్మించిన గోరుకల్లు జలాశయంపై వైఎస్సార్ ప్రత్యేక దృష్టి పెట్టి రూ.445కోట్లు ఖర్చు చేసి నిర్మాణం చేపట్టారని ఎమ్మెల్యే అన్నారు. ఆయన కాలంలోనే 80శాతం వరకు పనులు పూర్తి చేశామని, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు తామే పూర్తి చేసినట్లు ప్రచారం చేసుకుంటున్నాయని చెప్పారు. గత ప్రభుత్వంలో ఇంకా పనులు చేయాల్సి ఉండగా గోరుకల్లు పూర్తి చేసినట్లు శిలాఫలాకాన్ని ప్రారంభించడం సిగ్గుచేటన్నారు. అలాగే ఓర్వకల్లు, కర్నూలు, మిడుతూర్, ఇతర మండలాలకు నీరు అందించేందుకు మల్లికార్జున రిజర్వాయర్ నిర్మాణం కోసం రూ. 1500కోట్లు కేటాయించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, సర్పంచ్ మేకల పల్లవి, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు జాకీర్‌హుసేన్,మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు, చందమామ బాబు, రాజన్న, టైలర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన

కల్లూరు : ప్రజాసంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో ప్రజలందరికీ సుపరిపాలన అందిస్తున్నామని నంద్యాల వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం పెద్దటేకూరు గ్రామపంచాయతీ మజరా గ్రామం దొడ్డిపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామంలో వేసిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఎమ్మెల్యే గ్రామంలో విస్తృతంగా పర్యటిస్తూ సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. గ్రామ ప్రజలు లక్ష్మీపురం గ్రామం నుంచి దొడ్డిపాడు గ్రామంలోకి రోడ్డు నిర్మించాలని, పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మించాలని, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆయా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ మునిస్వామి, గ్రామ నాయకులు హనుమంత్‌రెడ్డి, ఫక్రుద్దీన్, అలీ, షకూర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నెలాఖరులో ఇళ్ల పట్టాలు

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్



సుంకేసులలో వరద బాధితుల లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): సుంకేసులలో 2009 వరదల్లో సర్వం కోల్పోయిన బాధితులకు ఈ నెలాఖరులో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హామీ ఇచ్చారు. బాధితులెవ్వరూ అధైర్య పడొద్దని, ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని భరోసానిచ్చారు. సర్వే నంబర్ 56, 57, 58, 38, 39లోని 54 ఎకరాల్లో బాధిత కుటుంబాలకు ఇళ్ల పట్టాల పంపిణీకి చర్యలు తీసుకున్నామన్నారు. శనివారం కర్నూలు మండలం సుంకేసుల గ్రామంలో వరద బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. 54 ఎకరాల్లో ఏపుగా పెరిగిన ముళ్లకంపలను జేసీబీతో తొలగించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వాలు వరద బాధితులను గాలికొదిలేశాయని, ప్రస్తుతం జగనన్న ప్రభుత్వంలో 2009 వరద బాధితులకు పూర్తిస్థాయిలో అండగా నిలిచామన్నారు. గతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన తనను 54 ఎకరాల్లో ఒక్కొక్కరికీ 3 సెంట్ల స్థలంలో ఇళ్ల పట్టాలిప్పించాలని బాధిత కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారన్నారు. దీంతో ఇళ్ల పట్టాల మంజూరుకు ప్రభుత్వానికి నివేదించామన్నారు. ఆదేశాలు రాగానే పట్టాలిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు అనూక్, రాజు, మద్దిలేటి, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఇమ్మానియేలు, వైఎస్సార్‌సీపీ నాయకులు కురుపన్న, గంగిరెడ్డి, నగేష్ పాల్గొన్నారు.

కేసులను సత్వరమే విచారించండి

సి.బెళగల్ : ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై సత్వరమే విచారించి కేసులు నమోదు చేయాలని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పోలీసులను ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, కేసుల నమోదు వివరాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలపై ప్రత్యేక నిఘాను ఉంచి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. పాత నేరస్థులపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని సూచించారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు కర్నూలు ఆపరేషన్స్ ఈఈ రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ అభివృద్ధి పనుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు గణేష్ నగర్, శ్రీరామ్ నగర్, రెవెన్యూ కాలనీ, పోస్టల్ కాలనీ, జయరాం నగర్, నంద్యాల చెక్ పోస్టు ఏరియా, డాక్టర్స్ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, పార్థసారథి కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

హాకీ క్రీడను గుర్తించాలి

కర్నూలు(రూరల్): హాకీ క్రీడను గుర్తించి ఎంసెట్, నీట్ ప్రవేశాల్లో స్పోర్ట్స్ కోట కింద సీట్లు కేటాయించాలని హాకీ కర్నూలు జిల్లా కార్యదర్శి దాసరి సుధీర్ కోరారు. హాకీ క్రీడాకారులకు క్రీడా కోట రద్దు చేయడంతో సంఘం సభ్యులు హైకోర్టుకు వెళ్లారన్నారు. దీనిపై క్రీడా కోటను కల్పించాలని కోర్టు తీర్పు కూడా ఇచ్చిందన్నారు. ఇది అమలయ్యేలా ప్రభుత్వం చూడాలని కోరారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న టోల్ ప్లాజా ఇన్‌చార్జ్ మదన్‌మోహన్

ఓర్వకల్లు : వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను తప్పక పాటించి, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని రాయలసీమ ఎక్స్‌ప్రెస్ హైవే ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్టు ఇన్‌చార్జ్ మదన్‌మోహన్ అన్నారు. శుక్రవారం స్థానిక నన్నూరు టోల్ ప్లాజా ఇన్‌చార్జ్ మేనేజర్ శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆజాద్ కా అమృత్ మహోత్సవ కార్యక్రమానికి మదన్‌మోహన్‌తో పాటు, టోల్ ప్లాజా ఆపరేషన్ హెడ్ అరుణ్ రాజ్, టోల్ ప్లాజా మేనేజర్ మనిరంజన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదన్నారు. ద్విచక్రవాహన దారులు హెల్మెట్ ధరించాలని, సెల్ ఫోన్లు మాట్లాడుకుంటూ వాహనాలు నడపడరాదని, కారులో డ్రైవింగ్ చేసేటప్పుడు సీట్ బెల్టు ధరించాలని సూచించారు. అనంతరం మెడికవర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 180 మంది వాహనదారులకు బీపీ, షుగర్, గుండె పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అలాగే హియర్ జాప్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచితంగా దంత వైద్య పరీక్షలు నిర్వహించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ మేనేజర్ రంజిత్, టోల్ ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్.కొంతలపాడుకు బస్సు సర్వీసు పునరుద్ధరణ



బస్సును ప్రారంభిస్తున్న ప్రభాకర్‌రెడ్డి, నాయకులు

ఓర్వకల్లు : మండలంలోని ఎన్. కొంతలపాడు గ్రామానికి బస్సు సర్వీసును ఆర్టీసీ అధికారులు పునరుద్ధరించారు. శనివారం గుట్టపాడు గ్రామంలో మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేసి బస్సును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల ప్రజల సౌకర్యార్థం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చొరవతో బస్సు సర్వీసును పునరుద్ధరించడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రతి రోజు కర్నూలు బస్టాండ్ నుంచి ఉదయం 7 గంటలకు బయలుదేరి 8 గంటలకు కొంతలపాడు చేరుకుంటుందన్నారు. మళ్లీ సాయంత్రం 4 గంటలకు బయలుదేరి 5 గంటలకు కొంతలపాడుకు చేరుకుంటుందని వెల్లడించారు. 12 ఏళ్ల నుంచి ప్రజలు, విద్యార్థులు బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిని అర్థం చేసుకొని బస్సు సర్వీసును పునరుద్ధరించిన ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయంలో లక్ష్మికాంతారెడ్డి పట్టుదల అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, స్థానిక నాయకులు చిన్న అయ్యపురెడ్డి, కొంతలపాడు మద్దయ్య, మల్లికార్జునప్ప, మరికొండ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగులను నలిపేద్దాం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య

కల్లూరు: ఆరోగ్యంతమైన పిల్లల కోసం నులి పురుగులను నులిపేద్దామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామగిడ్డయ్య పిలుపునిచ్చారు. శనివారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. పరిపాలనాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈఓలు శ్రీనివాసులు, వనజ కుమారిలకు నులి పురుగు నివారణ మందుల కిట్లను అందించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ నులి పురుగు నివారణ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఈనెల 10న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు మందు వేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పిల్లలు, కిషోర బాలికల కడుపులో నులి పురుగులు ఉన్నట్లయితే పోషకాహార లోపం, రక్తహీనత వల్ల నీరసంగా ఉంటారన్నారు. ఫలితంగా పిల్లల్లో శారీరక, మానసిక పెరుగుదల లోపిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు ఆఫీసర్ హేమలత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

10న నులిపురుగు నివారణ దినోత్సవం

గూడూరు: ఈ నెల 10న జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవం నిర్వహించాలని ఎంపీడీఓ మాధవీలత సూచించారు. శనివారం స్థానిక వైకేపీ కార్యాలయం ఆవరణలో పాఠశాలల హెచ్‌ఎంలు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ 2 నుంచి 18 సంవత్సరాల వయసు మధ్యలో ఉన్న పిల్లలందరికీ తప్పని సరిగా ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలన్నారు. ఎంఈఓ నాగరాజు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కజొన్న... ఆరోగ్యానికి మేలన్న!



మొక్కజొన్నను అమ్మకానికి సిద్ధం చేస్తున్న దృశ్యం

కర్నూలు (న్యూటౌన్): ప్రస్తుతం మొక్కజొన్న కంకుల సీజన్ ప్రారంభమైంది. వర్షాకాలంలో వేడివేడిగా కాల్చిన మొక్కజొన్న కంకులు తినేందుకు ప్రతి ఒక్కరూ ఇష్టపడతారు. ఇందులో అధిక మొత్తంలో ఉన్న ప్రొటీన్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని వైద్యులు చెబుతున్నారు. మొక్కజొన్నలో పీచు పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియకు బాగా పని చేస్తుంది. మలబద్ధకం, మొలలు వంటి వ్యాధులు రాకుండా కాపాడుతుంది. పేగు కేన్సర్‌ను అరికడుతుంది. మొక్కజొన్నలో మెగ్నీషియం, ఐరన్, కాపర్, పాస్పరస్ వంటి మినరల్స్ అధికంగా ఉంటాయి. ఇది ఎముకలు గట్టిపడేలా చేస్తాయి. అంతే కాకుండా కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచేందుకు సహకరిస్తాయి. ఇందులో యాంటి యాక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మాన్ని కాంతివంతంగా ఉంచుతాయి. ఈ గింజల నుంచి తీసిన నూనెలలో లీనో లే యాసిడ్ ఉంటుంది. ఇది చర్మంపై మంటలను, ర్యాషెస్‌ను తగ్గిస్తుంది. ఐరన్, ఫోలిక్ యాసిడ్, రక్త హీనత నుంచి కాపాడుతుంది. అంతే కాకుండా కొలన్ కేన్సర్ నివారణకు, డయాబెటీస్ నివారణకు మొక్కజొన్న ఎంతో మేలు చేస్తుంది.

మొక్కజొన్నలో పోషకాలు

మొక్కజొన్నలో ఎన్నో పోషక విలువలున్నాయి. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలిగి ఉంటుంది. శరీరానికి కావాల్సిన ప్రొటీన్లు, కొన్ని రకాల పోషకాలు పుష్కలంగా అందుతాయి. రక్తహీనతను తగ్గించడంతో పాటు జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. – డాక్టర్ మీనిగ శ్రీనివాసులు, వైద్యాధికారి, కర్నూలు